క్లుప్తంగా

ఘనంగా ఆయుష్య హోమం



హోమం చేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: భక్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ప్రముఖ పుణ్య క్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ఆయుష్య హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో నెట్టికంటి ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయుష్య హోమం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం యాడికి మండలం తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస హేమంత్‌రెడ్డి, గొలుసు సుహాసిని వివాహం జరిగింది. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో యాడికి మాజీ జెడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంజీవరాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

పుట్లూరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఓఎంఆర్ పరీక్షా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఆదర్శ పాఠశాల వద్దకు పరీక్షా సమయానికి గంట ముందు రావాలన్నారు. హాల్ టికెట్‌లో ఫోటో రాని విద్యార్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను తీసుకరావాలన్నారు.

ఘనంగా రాములోరి విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

పెద్దపప్పూరు: అత్తిరాలదిన్నె గ్రామంలో ఆదివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. గ్రామంలో దాదాపు రూ.25 లక్షల వ్యయంతో రామాలయం నిర్మించారు. ఉదయం ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలను వేదమంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా చిన్నయక్కలూరు గ్రామ సమీపాలన నారప్ప తాత ఆశ్రమంలో నాగదేవతలను పునఃప్రతిష్ఠించారు. పలుగ్రామాలకు చెందిన భజన బృందాలు ఆలపించిన భక్తి గీతాలు ఆహుతులను ఆకట్టు కున్నాయి. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గార్లదిన్నె: మండల పరిధిలోని కనంపల్లికి చెందిన ఓ మహిళపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా పేర్కొన్నారు. కనంపల్లికి చెందిన జానకి అనే మహిళ అదే గ్రామానికి చెందిన దళిత యువకుడిని కులం పేరుతో దూషించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిందన్నారు. ఈ నేపథ్యంలో దళిత సంఘాలు ఆందోళన చేశాయన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు ఫిర్యాదు మేరకు జానకిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పామిడిలో వర్షం

పామిడి: పామిడిలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు ఈదరుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు డాబా ఇళ్ల రేకులు ఎగిసిపడ్డాయి. విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అమరుల త్యాగ ఫలితమే వర్గీకరణ

పెద్దవడుగూరు : ఎంతోమంది అమరవీరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదినారాయణ, కత్తుల కొండయ్య, గూడూరు రంగస్వామి, భూపతి పేర్కొన్నారు. ఆదివారం పెద్దవడుగూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సమస్యల తిష్ట

- పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్
- పేరుకుపోయిన గుజిరీ సామగ్రి
- రోగులకు తప్పని అవస్థలు



నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్



ఆర్‌ఓ ప్లాంట్ పైపులను కత్తిరించి దృశ్యం



ఆసుపత్రిలో అడ్డుగా ఉన్న సామగ్రి

తాడిపత్రి రూరల్: స్థానిక ఏరియా ఆసుపత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ పని చేయకపోవడంతో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మరోవైపు ఆస్పత్రిలో భారీగా గుజిరీ సామగ్రి పేరుకుపోవడంతో ఆస్పత్రి డంప్ యార్డును తలపిస్తోంది. తాడిపత్రి ఏరియా ఆసుపత్రి మూడు జిల్లాల కేంద్రంగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 30 పడకలను కాస్త వంద పడకల ఆస్పత్రి మార్చారు. ఇందుకోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోట్ల నిధులను కేటాయించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభమయ్యాయి. పనులు చివరి దశకు వచ్చే సరికి ప్రభుత్వం మారడంతో పనులతో పాటు బిల్లులు కూడా నిలిచిపోయాయి.

తీరని రోగుల దాహార్తి..

ఆస్పత్రికి రోజూ ఓపీ కింద 800 వరకు రోగులు వస్తుంటారు. ఇక గర్భిణులు, బాలింతలు, ఇతర రోగులు పెద్దసంఖ్యలో ఆస్పత్రిలో చేరుతుంటారు. ఈనేపథ్యంలో నాలుగేళ్ల క్రితం బాలింతల వార్డు వద్ద రూ.వ్యయంతో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత నిర్వహణను పట్టించుకోవడంతో ప్లాంట్ పని చేయడం లేదు. వేసవి నేపథ్యంలో రోగులు దాహార్తితో అలమటించాల్సి పరిస్థితి నెలకొంది. నీటి సమస్యను అధికమించడానికి రోగులు, వారి బంధువులు ఇళ్ల నుంచి బాటిళ్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. ఇంకొందరు బయట ఉన్న కూల్ డ్రింక్స్ షాపుల్లో వాటర్ బాటిళ్లను కొంటున్నారు.

చెత్తలా పెరిగిపోయిన గుజిరీ సామాన్లు, వ్యర్థాలు..

ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందిగా గుజిరీ సామగ్రి, వ్యర్థాలు పేరుకుపోయాయి. పాత ఆస్పత్రి కూల్చివేసే సమయంలో ఉన్న మంచాలు, ఇనుప సామగ్రిని ఇక్కడి నుంచి తొలగించడంలో జాప్యం చేశారు. గుజిరీ సామ్రగి పెద్ద ఎత్తున ఉండటంతో ఆస్పత్రి అపరిశుభ్రంగా ఉంటోంది. ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు, వివిధ మందులు వచ్చిన బాక్స్‌లను సైతం ఇష్టానుసారంగా వేస్తుండంతో ఆసుపత్రిలో పారిశుద్యం లోపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆస్పత్రిలోని సమస్యలు తీర్చాలని రోగులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం మధ్యాహ్న భోజన నిర్వాహకులు క్యాన్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ఆర్‌ఓ ప్లాంట్ స్థానంలో కొత్త వాటి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఆస్పత్రిలో ఉన్న గుజిరీ సామగ్రిని తొలగించడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో టెండర్లు వేసి వాటిని తొలగిస్తాం.

– డేవిడ్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు: భీమునిపల్లి సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి పేక ముక్కలు, రూ. 6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

ముమ్మరంగా పోలీస్ తనిఖీలు

తాడిపత్రిటౌన్: పట్టణంలో శనివారం అర్ధరాత్రి వేళ పోలీసులు పలు హోటళ్లు, లాడ్జీల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హోటళ్లు, లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా, అనుమానస్పద వ్యక్తులు ఉన్నారా అన్న కోణంలో తనిఖీలు చేపట్టినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్‌బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్.. ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో చెరువు కట్ట వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళుతున్న ఆటోను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుంతకల్లుకు చెందిన రవి, ధనుంజయ గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించండి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్

పెద్దవడుగూరు : మండలంలోని కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు త్వరగా చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం అప్పేచర్ల గ్రామంలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవి సందర్భంగా పని ప్రదేశంలో కూలీలకు నీడ ఏర్పాటు చేయాలన్నారు. శాఖ కార్యదర్శి నారాయణస్వామి, సభ్యులు సూర్యబాబు, శరత్‌బాబు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పోలా రంగయ్య, అల్లాబకాష్, శరత్, రామాంజినేయులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాజేష్‌గౌడ్

గుంతకల్లు: ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పట్టణ ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం కింద ఆర్థికసాయం అందజేసినట్లే ఈ ప్రభుత్వం కూడా అమలు చేయాలన్నారు. ఒక ఆటో డ్రైవర్లకు శాపంగా మారిన జీఓ నంబర్ 21, 31లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆటోలపై ఆర్టీఓ, పోలీసు దాడులు పెరిగాయని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తరహాలో తమకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అభివృద్ధికి చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు రాజు, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేష్, సీపీఐ పట్టణ, రూరల్ కార్యదర్శులు గోపీనాథ్, రాము రాయల్, నాయకులు ఎస్ఎండీ గౌస్ శివా, దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పూలే సినిమాను అడ్డుకోవడం దారుణం



చాంద్‌బాషాకు పూలే చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: మహాత్మ జ్యోతీబా పూలేపై నిర్మించిన సినిమాకు సెన్సార్ బోర్డు అనేక సాకులు చెబుతూ అడ్డుకోవడం దారుణమని శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా విమర్శించారు. ఆదివారం పట్టణంలోని ఏపీ పెన్షనర్స్ కార్యాలయంలో వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ.. మహారాష్ట్రకు చెందిన అనురాగ్ కశ్యప్ అనే దర్శకుడు మహాత్మా జ్యోతీబా పూలే దంపతుల జీవితం ఆధారంగా నిర్మించిన పూలే సినిమాపై పలుమార్లు సెన్సార్ జరిగినప్పటికీ సెన్సార్ బోర్డు ఇంకా ఆటంకాలు సృష్టిస్తూ క్లియరెన్స్ ఇవ్వకుండా అడ్డుకోవడంతో విడుదలకు నోచుకోవడం లేదన్నారు. సినిమాలో ఉన్న వాస్తవాలు సభ్య సమాజానికి తెలిసిపోతాయనే ఉద్దేశంతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. స్మగ్లింగ్ సినిమాలు, తొడగొట్టుకోవడం, నరక్కోవడం లాంటి హింసాత్మక సినిమాలకు క్లియరెన్స్ ఇస్తున్నారన్నారు. లక్షలాది మంది మహిళలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దిన పూలే దంపతులను భారతావని గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్, భారతి సాహితీ సమితి కార్యదర్శి వీ.గంగరాజు, ఆర్‌డీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తగరం రామాంజనేయులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు చలపతి, ఈఓ రాముడు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేకుంటే చర్యలు

బుక్కరాయసముద్రం: వాహన దారులు రికార్డులు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పుల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి వాహన డ్రైవర్ తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు నాలుగు చక్రాల వాహనాలకు ఇన్సూరెన్స్ కచ్చితంగా ఉండాలన్నారు. అనంతరం నిబంధనలు పాటించని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడిపత్రి టౌన్: ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని బండామసీదు సమీపంలో నివాసం ఉంటున్న అలీ భార్య ఉసేన్ బీ(28) కడుపు నొప్పి తాళలేక శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం అక్కడే మృతి చెందింది. ఉసేన్‌బీ తల్లి అలీభీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు

గార్లదిన్నె: మండల పరిధిలోని మర్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1986–1987 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరూ ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నతనంలో ఆడి, పాడిన జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని రోజంతా సరదాగా గడిపారు. ఒకరి కష్ట సుఖాలను ఒకరు తెలుసుకున్నారు. అనంతరం నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులు ఆనందరావు, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రవి, ఆది నారాయణ, రాజేశ్వర ఆచారి, చలపతి, పరమేశ్వరరెడ్డి, తాతిరెడ్డి, మల్లికార్జున, రత్నమయ్య, భాగ్యలక్ష్మి, నాగమణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి జ్యోతుల మహోత్సవం



జ్యోతులను నెత్తిన పెట్టుకుని నృత్యం చేస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో ఆదివారం చౌడేశ్వరి దేవి జ్యోతుల మహోత్సవం ఘనంగా జరిగింది. నేత కార్మికులు బియ్యం పిండి, బెల్లం, గోడంబి, ద్రాక్ష, నెయ్యితో ప్రత్యేకంగా తయారుచేసిన అమ్మవారి జ్యోతులను నెత్తిన పెట్టుకుని భక్తిగీతాలకు అనుగుణంగా గ్రామ పురవీధుల్లో నాట్యం చేస్తూ ముందుకు సాగారు. వేడుకను తిలకించడానికి పరిసర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో ఆదివారం పాముకాటుతో నరసింహులు అనే రైతు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నరసింహులు తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన రైతు వెంటనే విషయాన్ని పక్క పొలాల రైతులు, కుటుంబ సభ్యులకు చెప్పాడు. అప్రమత్తమైన వారు నరసింహులును చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు.

మరణంపై విజయమే ‘ఈస్టర్’



గుత్తి ఆర్‌ఎస్‌లో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ డేవిడ్ నాయక్



పామిడిలో పాస్టర్ విశ్వమోహన్ ఈస్టర్ సందేశం



తాడిపత్రిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పామిడి: మరణంపై క్రీస్తు విజయమే ఈస్టర్ అని పాస్టర్ రెవరెండ్ బి.విశ్వమోహన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అన్ని చర్చిల్లో ఈస్టర్ పండుగ నిర్వహించారు.స్థానిక సీఎస్ఐ చర్చిలో జరిగిన ఆరాధనలో పాస్టర్ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు శిలువపై మృతి చెంది మూడవ రోజున మృత్యుంజయుడై తిరిగి లేచిన ఈరోజును క్రైస్తవులు ఈస్టర్ (పునరుత్థాన) పండుగగా జరుపుకుంటారని తెలిపారు. సర్వమానవ పాపపరిహారార్థం క్రీస్తు శిలువలో మృతి చెంది తిరిగి లేవడం ద్వారా మనకు రక్షణ మహోత్సవం ప్రాప్తించిందన్నారు. క్రీస్తుతోనే మనకు నిత్యజీవం లభిస్తుందన్నారు. అనంతరం ఒకరినొకరు ఈస్టర్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో చర్చీ సెక్రెటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, చర్చీ సభ్యులు వీరయ్య, జకరయ్య, అబ్రహాం, రత్నరాజు, ఆనంద్‌రాజ్, కిష్టఫర్ బాబు, రాజు, ప్రసాద్, రజని, పాస్టరమ్మ సువర్ణమ్మ, శాంతమ్మ, చంద్రకళ, ప్రిస్కిల్లా, ప్రశాంతి, వాణి, రేచెల్, మెర్సీ, మహిమ పాల్గొన్నారు.

అన్నదానం..

పామిడి: అప్పాజీపేట గ్రామంలో ఆదివారం మిస్పా గ్రేస్ మినిస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ జరుపుకున్నారు. పాస్టర్ ఎస్.మహమ్మద్ రసూల్ సారథ్యంలో అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లో..

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుత్తిలోని సీఎస్ఐ చర్చి, ఆర్‌ఎస్‌లోని సీఎస్ఐ చర్చితో పాటు హోరబ్ చర్చి, రెడ్ చర్చి, సెయింట్ చర్చిలతో పాటు పలు మందిరాల్లో ప్రార్థనలు జరిగాయి. గుత్తిలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ సాల్మన్ బాబు, ఆర్‌ఎస్‌లోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ డేవిడ్ నాయక్ ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

తాడిపత్రి: మండలంలోని క్రైస్తవులు ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం సాయంత్రం నుంచే ఆయా గ్రామాల్లోని చర్చిలకు పెద్ద ఎత్తున క్రైస్తవులు చేరుకోగా, ఫాదర్లు, పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈస్టర్ ప్రార్థనలు కొనసాగాయి. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని ఆవులతిప్పాయపల్లి, చుక్కలూరు గ్రామాల్లోని ఆర్‌సీఎం చర్చిల్లో ఫాదర్ రాజశేఖర్, ఫాదర్ డేవిడ్ అరులప్ప క్రీస్తు సందేశాన్ని వినిపించారు.

యాడికి: మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ జయరాజు బాబు, అగాపే ప్రార్థనా మందిరంలో బత్తుల ప్రసాద్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ సర్వమానవాళి కోసం ఏసు ప్రాణత్యాగం చేసి మూడు రోజుల తర్వాత సజీవుడుగా తిరిగి లేచాడని తెలిపారు. మహోన్నతుడైన ఏసు ప్రభువు మరణం నుంచి లేచిన దినాన్ని ఈస్టర్‌గా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గార్లదిన్నె: మండలంలో వివిధ చర్చిల్లో ఈస్టర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. గార్లదిన్నె, యర్రగుంట్ల, తిమ్మంపేట, పెనక చెర్ల డ్యాం, పెనకచెర్ల, కేశవాపురం, ముకుందాపురం మర్తాడు చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. మర్తాడు మిస్పాగ్రేస్ చర్చిలో పాస్టర్ సయ్యద్ వలి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



యాడికి సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ జయరాజు



గార్లదిన్నె మండలం మర్తాడులో ఈస్టర్ వేడుకలు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి అశ్వర్థ

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ డిపో, బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే సురక్షితంగా బయటపడటంతో పాటు ప్రయాణికులను ఎలా కాపాడాలనే విషయాలపై అగ్నిమాపక శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలోని పెట్రోల్ పంప్ వద్ద స్టాటిక్ ఎలక్ట్రిసిటీతో అగ్ని ప్రమాదం జరిగితే ఆ మంటలను అదుపు చేసే విధానాలపై గ్యారేజీ సిబ్బందికి మాక్‌డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపారు. ఏసీ బస్సుల్లో ప్రమాదాలు జరిగి మంటలు వ్యాపించినప్పుడు వెంటనే ప్రయాణికులను అప్రమత్తం చేసి అందుబాటులో ఉన్న నిరోధక పరికరాలను ఉపయోగించి మంటలను ఆర్పివేయాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి అశ్వర్థ, డిపో అధికారులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.